క్లుప్తంగా

మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి

గంట్యాడ: మండలంలో ఎక్కడైనా మట్టి తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తవ్వకాలు చేపడుతున్న వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మట్టి తవ్వకాలను ఉపేక్షించవద్దన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



జగ్గయ్యపేటలో ప్రారంభించిన చలివేంద్రం

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేటలో హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ వ్యవస్థాపకుడు ఆర్.హరిబాబు ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. స్థానిక స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామపెద్దలు వంటాకు శ్రీను, తదితరులు ప్రారంభించారు. ఎండా కాలం పూర్తయ్యే వరకు చలివేంద్రం ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు.

నిరుపయోగంగా నీటి తొట్టెలు



గుడివాడలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టె

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన నీటితొట్టెలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇదిచాలక కూటమి ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మళ్లీ నీటి తొట్టెల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో నిర్మించినవే నిరుపయోగంగా పడి ఉన్నాయని.. వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థుల సత్తా..



వజ్రపు శశికుమార్



తొత్తడి రిషిత

శృంగవరపుకోట: మండలంలోని సంతగవిరమ్మపేట పంచాయతీ ముసలినాయుడుపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఏపీఆర్ఎస్ ఐదో తరగతి ప్రవేశ పరీక్షలో సత్తా చాటి స్టేట్ ర్యాంకులు సాధించారని హెచ్ఎం టి.నర్సింగరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎస్.కోట శివారు సీతంపేట గ్రామానికి చెందితన వజ్రపు శశికుమార్ రాష్ట్రస్థాయిలో ఒకటో ర్యాంక్, చామలాపల్లి గ్రామానికి చెందిన తొత్తడి రిషిత 8వ ర్యాంక్ సాధించారు. ఈ మేరకు విద్యార్థులు, హెచ్ఎం నర్సింగరావు, ఉపాధ్యాయుడు ఎన్.ప్రసాద్‌లను స్కూల్ కమిటీ చైర్మన్ జి.నాయుడు, గ్రామపెద్దలు అభినందించారు.

పరిసరాలను అపరిశుభ్రం చేస్తే చర్యలు తప్పవు



దుకాణ నిర్వాహకులతో మాట్లాడుతున్న ప్రజారోగ్య సిబ్బంది

విజయనగరం: స్క్రాప్ దుకాణాలు నిర్వాహకులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, లేకుంటే చర్యలు తప్పవని విజయనగరం కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి కె.సాంబమూర్తి స్పష్టం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న స్క్రాప్ దుకాణాలను పారిశుధ్య పర్యవేక్షకులు షాలెం రాజ్, రమేష్ రెడ్డి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. దుకాణాల సమీపంలో వ్యర్థాలు చెల్లాచెదురుగా పడి వుండడాన్ని గమనించి దుకాణ యజమానులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్క్రాప్ దుకాణాల వద్దకు అనేక వ్యర్థ వస్తువులు వస్తుంటాయని వాటిని రహదారుల పైన పరిసర ప్రాంతాలలో పడవేయకుండా జాగ్రత్తలు పాటించాల్సిన బాధ్యత స్క్రాప్ దుకాణ యజమానులదేనని అన్నారు. తాము ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి స్క్రాప్ దుకాణాలను పరిశీలిస్తున్నామన్నారు. పలుమార్లు చెప్పినప్పటికీ కొంతమంది స్క్రాప్ దుకాణ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇకపై స్క్రాప్ దుకాణాలు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అన్నదాత సేవలో..

అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు

- గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు
- నాణ్యమైన ఫలితాలు
- వీటి ఆధారంగానే విత్తనాలు, ఎరువుల గుర్తింపు
- పశువుల వ్యాధులపై కూడా పరీక్షలు
- జిల్లాలో 9 ల్యాబ్‌లు ఏర్పాటు చేసిన ఘతన వైఎస్సార్‌సీపీదే..



కొత్తవలసలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్

కొత్తవలస: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. వారికి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తూ వచ్చింది. ప్రధానంగా పంట వేసే ముందు విత్తనాలు మొదలుకుని పంట పెరిగే కొద్దీ వేసే ఎరువుల విషయంలోను ఎన్నో సూచనలు, సలహాలు అందించింది. ప్రత్యేకంగా విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షల కోసం.. పశువులకు వచ్చే వ్యాధులపై పలు రకాల పరీక్షల కోసం డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఈ ఇంటిగ్రేడ్ ల్యాబ్‌లు రైతుల్లో ధైర్యాన్ని పెంచాయి. గతంలో ఈ తరహా ల్యాబ్‌లు జిల్లాకు ఒక్కటి మాత్రమే ఉండేది. దీంతో పశువులు, ఎరువులు, విత్తనాలకు సంబంధించిన పరీక్షల కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. ఫలితాలు వచ్చేనాటికి జరగాల్సిన నష్టం జరిగిపోయేది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి నియోజకవర్గానికి ఒకటి చొప్పున డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైఎస్సార్ పేరును తొలిగించింది. జిల్లాలో గల తొమ్మిది నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి సుమారు రూ. 68 లక్షలతో నిర్మించారు. అందులో పరికరాల కోసం రూ. 60 లక్షలు వెచ్చించారు. వీటిలో వ్యవసాయ శాఖకు సంబంధించి ఏఓ (ఆఫీషియల్ అనలిస్ట్)తో పాటు ఇద్దరు ఏఈఓలు (ఫెర్టిలైజర్, సీడ్ జూనియర్ అనలిస్ట్)లు, పశుసంవర్ధక శాఖకు సంబంధించి ఒక ల్యాబ్ టెక్నీషియన్, మరొక సహాయ టెక్నీషియన్‌లు అందుబాటులో ఉంటూ నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అన్ని రకాల పరీక్షలు..



జిల్లాలో గల 9 ల్యాబ్‌లలో పశువులకు సంబంధించి అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపడుతున్నాం. గతంలో ఈ పరీక్షలు చేయడానికి ఇబ్బంది పడేవారం. ఒక్కో ల్యాబ్‌లో నెలకు సరాసరి నాలుగు వందల వరకు పరీక్షలు చేపడుతున్నాం. అలాగే ఎరువులు, విత్తనాల నాణ్యత పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నాం.

– వైవీ రమణ, పశువర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్

విరివిగా పరీక్షలు

ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ ఇంటిగ్రేడెడ్ ల్యాబ్‌లలో పశువులకు సంబంధించి పాలు, పేడ, రక్తం, మూత్రం, చర్మ,గడ్డలు, తదితర పరీక్షలతో పాటు వరి విత్తనాల పరీక్షలు, ఎరువుల నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒక్కో ల్యాబ్‌లో నెలకు సరాసరి నాలుగు వందల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాటి ఫలితాల ప్రకారం రైతులను అప్రమత్తం చేస్తూ సాగుకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోవాలో వివరిస్తున్నారు. ఏయే నేలల్లో ఏయే పంటలు వేయాలి..ఏయే ఎరువులు వాడాలి.. విత్తనాలు, ఎరువుల నాణ్యత ఎలా ఉన్నదీ వివరిస్తారు.

సుమారు 15 రకాల పరీక్షలు..



కొత్తవలస ల్యాబ్‌లో పశువులకు సంబంధించి 15 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపడుతున్నాం. రైతులు నేరుగా ల్యాబ్‌లకు నమూనాలు తీసుకువస్తున్నారు. మరికొన్ని పశువైద్యశాలకు సంబంధించిన సిబ్బంది తీసుకొస్తున్నారు. గతంలో ఈ తరహా పరీక్షలు విజయనగరం జిల్లా కేంద్రంలో మాత్రమే నిర్వహించేవారు. ప్రస్తుతం అన్ని నియోజకవర్గాల్లో ల్యాబ్‌లున్నాయి.

– లగుడు శివ,కొత్తవలస ల్యాబ్ టెక్నీషియన్

వైఎస్సార్ పేరు తొలగించడం బాధాకరం..



ఈ ల్యాబ్‌లు రాకమునుపు పశువులకు వచ్చే వ్యాధి లక్షణాలను బట్టి వైద్యులు మందులు ఇచ్చేవారు. ప్రస్తుతం అన్ని రకాల పరీక్షలు చేసిన తర్వాతే మందులు ఇస్తున్నారు. ఫలితాలు కూడా ఎంతో మెరుగ్గా ఉంటున్నాయి. అయితే డాక్టర్ వైఎస్సార్ పేరును తొలగించడం మాత్రం బాధాకరం.

– బొడ్డు గణపతి, రైతు, రేగ గ్రామం, లక్కవరపుకోట మండలం

ఉదయం 5.30 గంటలకు పనులకు వెళ్లాలి..



పెదరావుపల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ శారదాదేవి

- డ్వామా పీడీ ఎస్.శారదాదేవి

కొత్తవలస: ఉపాధి వేతనదారులు ఉదయం 5.30 గంటలకు పనికి వెళ్తే వేతనం గిట్టుబాటు అవుతుందని డ్వామా పీడీ ఎస్.శారదాదేవి అన్నారు. మండలంలోని కంటకాపల్లి, పెదరావుపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడుతూ.. వేతనం గిట్టుబాటు అవుతున్నదీ,లేనిదీ అడిగి తెలుసుకున్నారు. పంట కాలువలు, చెరువులోకి నీరు వచ్చే కాలువల అభివృద్ధి పనులు చేపట్టాలని వేతనదారులు కోరారు. దీనికి ఆమె స్పందిస్తూ రైతులు తమ పొలాలు, తోటల్లో ఫారంపాండ్స్ తవ్వుకోవాలని సూచించారు. అలాగే మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ వై.జనార్దన్, ఈసీ కేశవ, పలువురు టీఏలు పాల్గొన్నారు.

• పుస్తకావిష్కరణ..



పుస్తకావిష్కరణలో పాల్గొన్న పెద్దలు, క్రీడాకారులు

శృంగవరపుకోట: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్ జి. శ్రీనివాసరావు రచించిన బ్యాడ్మింటన్ స్ట్రోక్ ఎలనైజేషన్ అండ్ లెర్నింగ్ అనే పుస్తకాన్ని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు బుధవారం స్థానిక కేంబ్రిడ్జి నారాయణ పాఠశాలలో వంద మంది క్రీడాకారుల సమక్షంలో ఆవిష్కరించారు. 13 రోజులుగా ఈ పాఠశాలలో వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎస్.కోట కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో తన క్రీడా ప్రస్థానం ప్రారంభమైందన్నారు. తన గురువు కోచ్ పి.శ్రీరాములు ఆశీస్సులతో ఎదిగానని చెప్పారు. చీఫ్ కోచ్ శ్రీరాములు మాట్లాడుతూ.. బ్యాడ్మింటన్‌లో తనకి ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకోవడం కోసం శ్రీనివాసరావు ఎంతో కష్టపడ్డాడని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ మళ్లా వేణు, రంది కిశోర్, ఆనల మోహన్, కోచ్‌లు మహ్మద్ ఖలీలుల్లా, హారిక, మౌనిక, శేఖర్ పలువురు క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను రద్దు చేయడం తగదు



మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సురేష్

దత్తిరాజేరు: ఈ నెల 20న కార్మిక సంఘాలు చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ అన్నారు. కోమటిపల్లి ఆటోస్టాండ్ వద్ద ఉపాధ్యక్షురాలు లక్ష్మితో కలిసి బుధవారం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల పొట్ట కొట్టడానికి 42 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు రావడం మోదీ ప్రభుత్వానికి తగదన్నారు. బ్యాంక్‌లు, ఎల్ఐసీలు, రైల్వే, పోస్టల్, విశాఖ స్టీల్‌ప్లాంట్ సహా అన్న రంగాలనూ ప్రైవేట్ పరం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

మరో సైబర్ మోసం..

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన ఓ యువతి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి నగదు పోగొట్టుకుంది. ఈ సంఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో జాబ్ ఆఫర్ అంటూ చెప్పి నేరగాళ్లు బాధితురాలి సెల్‌ఫోన్‌కు వాట్సాప్ ద్వారా లింక్ పంపించారన్నారు. ఈ లింక్ ద్వారా పలు దఫాలుగా 4,17,000 రూపాయలు స్వాహా చేశారని తెలిపారు. మోసపూరితంగా లింక్‌లు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఇద్దరికి గాయాలు..

ఓ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ పట్టణంలో ఆగి ఉన్న మరో ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

భోగాపురం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ రవికుమార్ హెచ్చరించారు. భోగాపురం, రెడ్డి కంచేరులో ఉన్న మద్యం దుకాణాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి కంచేరులో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మద్యం దుకాణాల వద్ద రెక్కీ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే తమకి తెలియజేయాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రతినిధి కె.గౌరి అన్నారు. స్థానిక లంకాపట్నంలో బుధవారం హెచ్ఐవీ ఎయిడ్స్‌పై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష తగదన్నారు. వారి పట్ల ప్రేమ అప్యాయత చూపించాలన్నారు. హెచ్ఐవీ సోకని తర్వాత కంటే సోకక ముందు జాగ్రత్త వహించాలన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం

విజయనగరం: సమాచార హక్కు చట్టం 2005 పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. నగరంలోని వివిధ సచివాలయల పరిధిలో సమాచార హక్కు చట్టంపై కార్యదర్శులు సదస్సులు బుధవారం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం 2005 యొక్క ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు. బ్యానర్లతో ప్రచారం చేసి సదస్సులు నిర్వహించి ప్రతి ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా చేపడుతున్న కార్యకలాపాలు ప్రజలకు తెలియాలన్న ఉద్దేశంతో సమాచార హక్కును ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం పట్ల మరింత చైతన్యం కలిగించేలా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

మూలకు చేరిన బోరు..



లక్కవరపుకోట మండలంలోని కొట్యాడ గ్రామ పంచాయతీ శివారు నాయుడుపేట రామాలయం వద్ద గల బోరు పాడైంది. ఎక్కువ మంది గ్రామస్తులు ఈ బోరుపైనే ఆధారపడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి బోరును వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

– లక్కవరపుకోట

పొంచి ఉన్న ప్రమాదం..



చీపురుపల్లి మండలంలోని కొత్తపేట జంక్షన్ వద్ద ఉన్న మలుపు (ఈ ప్రాంతంలో కల్వర్టు ఉంది) ప్రమాదకరంగా మారింది. రావివలస నుంచి కొత్తపేట, రేగిడిపేట, విజయరాంపురం, తదితర గ్రామాలకు వెళ్లేవారు ఈ జంక్షన్ మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. మలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. అలాగే రెండు వైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో అసలు ఇక్కడ కల్వర్టు ఉందన్న విషయం కూడా చాలా మందికి తెలియడం లేదు. ఏమాత్రం అలక్ష్యంగా ఉన్నా ప్రమాదం తప్పదు. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

– చీపురుపల్లి

ఆర్థిక సాయం..



వేపాడ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల శాల, రెండు ఆవులు అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. ఈ మేరకు బాధితుడు నిరుజోగి కృష్ణకు మన నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు బుధవారం పదివేల రూపాయల ఆర్థిక సాయం చేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

– వేపాడ

చిత్రలేఖనంలో శిక్షణ..



ఎస్.కోట శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు బుధవారం చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయుడు త్రినాథ్ చిన్నారులచే చిత్రాలు గీయించారు. ఈ సందర్భంగా చిత్రలేఖనంలో తీసుకోవాల్సిన మెలకువలు వివరించారు.

– శృంగవరపుకోట

ఘనంగా శ్రీరామచంద్ర సామ్రాజ్య పట్టాభిషేకం



హోమం జరిపిస్తున్న వేదపండితులు

మెరకముడిదాం: మండలంలోని భైరిపురంలో సీతారామస్వామి వారి దేవాలయంలో శ్రీరామచంద్ర సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమం సముద్రాల అప్పల వరాహలక్ష్మి నరసింహాచార్యులు, సముద్రాల శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టాభిషేక కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 10వ తేదీ నుంచి 18 వరకు పలు ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా పుత్రకామేష్టి, సుదర్శన,ధన్వంతరి, నక్షత్ర, గ్రహ, సీతారామ సుఖజీవన, లక్ష్మీ, ఆయుష్షు హవనాలతో పాటు మహా పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సీతారామ సుఖజీవన సర్గ హవనం పూజలు చేపట్టారు. కార్యక్రమాల్లో గ్రామానికి చెందిన భక్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కాలువలో పిచ్చి మొక్కలు..



పిచ్చి మొక్కలు, గడ్డితో నిండి ఉన్న వీధి కాలువ

చీపురుపల్లి: సాధారణంగా వీధి కాలువల్లో మురుగు నీరు ప్రవహిస్తుంది. కానీ ఆ కాలువలో మాత్రం పిచ్చి మొక్కలు మొలిచి మూసుకుపోయింది. మొక్కలు తొలగించి మురుగు నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడంలే దు. ఇదెక్కడో కాదండీ.. మండలంలోని రావివలస ఎస్సీ కాలనీ సమీపంలో మెయిన్‌రోడ్‌ను ఆనుకుని ఉన్న వీధి కాలువ. ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న వీధి కాలువ పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లోని ఇతర కాలువల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ కా లువలో పూర్తిగా పిచ్చి మొక్కలు, గడ్డి మొలవడంతో అసలు అక్కడ కాలువ ఉందా.. లేదా.. అన్న చందంగా పరిస్థితి తయారైంది. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర పేరుతో ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభు త్వం, అధికారులకు ఇటువంటి కాలువలు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.